www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 నవంబర్ 2023
5

కోనసీమ

నేడు వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్

ప్రజాశక్తి- అమలాపురం రూరల్

అమలాపురంలోని వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్.నరసింహారావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోజంట్ ఈ సర్వీస్, డెక్కన్ కెమికల్స్, ఇసుజూ మోటార్స్, సోలార్ ఆక్టివ్ ఫార్మా, దివీస్ ల్యాబ్ తదితర బహుళజాతి కంపెనీలు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయన్నారు. అలాగే దివీస్ లాబొరేటరీస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు ఈ నెల 17న ఉదయం 9 గంటలు నుంచి జరుగుతాయని ప్రిన్సిపల్ కె.మనోహర్ తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పిలుపు నిచ్చారు. అర్హులైన వారికి ఆకర్షణీయమైన వేతనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్, కె.శ్రావణ్ దిలీప్,బి. శ్రీనివాష్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ ఎలా..?

- కిడ్నీ వ్యాధి బాధితులకు కానరాని సేవలు
- ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో లేని డయాలసిస్ కేంద్రాలు
- డబ్బులు పెట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్న నిరుపేదలు

ప్రజాశక్తి-రాజోలు

రాజోలుకు చెదిన ఒక వ్యక్తి ఆరు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఉన్నట్టుండి కాళ్లు వాపులు రావడంతో స్థానిక వైద్యుడిని సంప్రదించి మందులు వాడాడు. అయినా తగ్గక పోవడంతో అమలాపురంలో ఓ ప్రయివేటు కిడ్నీసెంటర్‌కు వెళ్లారు. అక్కడ క్రియాటిన్ టెస్ట్ చేయించారు. 6.2 ఉన్నట్లు తేలింది. మూత్రపిండాలు చెడిపోయినట్లు వైద్యులు తేల్చడంతో కుటంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మొదట్లో మందులు వాడారు. తగ్గలేదు. చివరకు డయాలసిస్ చేయించుకోవాలని డాక్టర్ నిర్ధారించారు. అప్పటి నుంచి వారం రోజులకోసారి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆసుపత్రిలో బిల్లు తడిసి మోపెడైంది. చేసేది లేక ఇంటికి తీసుకొచ్చారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రస్తుతం డయాలసిస్ చేయిస్తున్నారు. ఇది అతనొక్కడి సమస్యే కాదు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలో ఉన్న డయాలసిస్ రోగుల సమస్య.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కిడ్నీ రోగుల సంఖ్య ఆందోళన కలిగించేలా పెరుగుతోంది. గతంలో ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఆహారపు అలవాట్లలో మార్పులు, నిత్యం ఒత్తిడికి గురికావడంతో పాటు, వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, కలుషిత నీటి వల్ల కిడ్నీ వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో 3వేల మంది వరకూ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో మినహా ఎక్కడా ప్రభుత్వ ఉచిత డయాలసిస్ సెంటర్ లేదు. దీంతో రాజోలు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పోరాటం చేసినా ప్రభుత్వం స్పందించలేదు. రాజోలు నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్ఐ యనముల వెంకటపతిరాజు ఒఎన్‌జిసి, గెయిల్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి ఎన్‌జిటిలో కేసు గెలిచారు. దీంతో రాజోలు ప్రాతంలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలోని నాలుగు పడకల డయాలసిస్ సెంటర్‌ని ఏర్పాటు చేసేందుకు రూ.65 లక్షలు కేటాయించారు. కాని నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించున్న పాపాన పోలేదు. 8 నెలల క్రితం మంజూరైన డయాలసిస్ కేంద్రం ఎందుకు ఏర్పాటు చేయడం లేదో తెలియడం లేదని కిడ్నీ వ్యాధిగ్రస్తులు పేర్కొంటున్నారు. దీనిపై రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.సూర్యనారాయణ ను వివరణ కోరగా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు ఎలాంటి ప్రతిపాదనలు జరగలేదని స్పష్టంచేశారు.

ఒక్కో మండలంలో సుమారు వందకు పైగానే డయాలసిస్ రోగులు ఉన్నారు. దగ్గరలో డయాలసిస్ కేంద్రం లేక జిల్లా కేంద్రంకు పరుగులు తీస్తున్నారు.జిల్లా కేంద్రంలో ఇటీవలే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ.. వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటం.. ప్రైవేట్‌లో డబ్బులు ఖర్చు పెట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. సఖినేటిపల్లి, అంతర్వేది నుంచి డయాలసిస్ చేసుకునేందుకు వెళ్లాలంటే.. కారు అద్దెకు తీసుకుని వెళ్లాల్సి వస్తుందని, కారు అద్దె రూ.3 వేలు, డయాలసిస్ రూ.10వేల వరకు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందంటున్నారు. డబ్బులు పెట్టుకోలేని నిరుపేద రోగులు చివరకు ప్రాణాలు వదులుతున్నారు.

త్వరగా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

చేవెళ్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మంజూరైన డయాలసిస్ కేంద్రాన్ని త్వరగా ఏర్పాటు చేయాలి. డయాలసిస్ కేంద్రం అందుబాటులో లేక పోవడంతో అమలాపురం లేదా రాజమహేంద్రవరానికి తీసుకెళ్లాల్సి వస్తుంది. ఒక్కసారికి రూ.10 వేల వరకూ ఖర్చుచేయాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే పేదలకు ఆసరాగా ఉంటుంది. దీనికి సంబంధించి రూ.65 లక్షల మంజూరైనా అడుగులు పడకపోవడం గమనార్హం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

- యనముల వెంకటపతి రాజు,ఎన్ఆర్ఐ

త్వరగా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఉచిత డయాలసిస్ సెంటర్ అత్యవసరం

రాజోలు నియోజకవర్గంలో చాలా మంది పేదలు కిడ్నీ బాధిత సమస్యలతో బాధపడుతున్నారు. వీరందరూ అమలాపురం, కాకినాడ లేదా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కోసం వెళ్తున్నారు. రాజోలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత రక్తశుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానికులకు కొంత మేర వెసులుబాటు కలుగుతుంది.

- భూపతి అజయ్ కుమార్, సామజిక వేత్త,రాజోలు

విచ్చలవిడిగా మందులు వాడొద్దు

వైద్యుల సలహాలు లేకుండా నొప్పులు, ఇతర జబ్బులకు విచ్చల విడిగా మందులు వాడొద్దు. మధుమేహం, బీపీని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీకి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. సక్రమంగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ డాక్టర్లు రాసిన మందులు వాడితే చాలా వరకూ అదుపులో ఉంచుకోవచ్చు. ఆహారపు అలవాట్లలో మార్పులు, నిత్యం ఒత్తిడికి గురికావడంతోపాటు, వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, కలుషిత నీటి వల్ల కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో సుమారు 2500 మందికి పైగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు.

- డాక్టర్. రాపాక రమేష్ బాబు,మలికిపురం

విషాదాన్ని మిగిల్చిన వాగ్వాదం

పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్న భర్త
అడ్డుకున్న భార్య, పెద్ద కుమారుడు
ఘటనలో భార్య, భర్తలు మృతి, కుమారుని పరిస్థితి విషమం

ప్రజాశక్తి -కొత్తపేట

చిన్నపాటి వివాదం ఆ ఇంట విషాదాన్ని నింపింది. పండుగపూటా సంతోషంగా ఉన్న ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి. మండలంలోని అవిడి గ్రామం కట్లమ్మ కాలనీలో పెదపూడి ఆదినారాయణ కుటుంబం నివాసం ఉంటుంది. ఆదివారం దిపావళి నేపథ్యంలో బాణసంచా కొనుగోలు కోసం భార్య మంగాదేవిని ఆదినారాయణ రూ.2వేలు అడిగాడు. ఈ విషయంలో వారిపై వాగ్వాదం నెలకొంది. డబ్బులు ఇవ్వకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని ఆదినారాయణ అమ్మేందుకు తెచ్చిన పెట్రోల్‌ను శరీరంపై పోసుకున్నాడు. వెంటనే భార్య మంగాదేవి, పెద్దకొడుకు దుర్గాప్రసాద్ వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. ఈ సమయంలో అగ్గిపుల్ల వెలిగించడంతో ముగ్గురినీ మంటలు చుట్టుముట్టాయి. ఇది చూసిన చిన్నకుమారుడు నాగరాజు కేకలు వేస్తూ వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశాడు. చుట్టుపక్కల స్థానికులు చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో మంగాదేవి(35) అక్కడికక్కడే సజీవ దహనమైంది. ఆదినారాయణ, దుర్గప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదినారాయణ మృతి చెందాడు. దుర్గాప్రసాద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కొత్తపేట ఎస్ఐ మణికుమార్ తెలిపారు. ఘటనా స్థలాన్ని కొత్తపేట డిఎస్‌పి కెవి.రమణ, రావుల పాలెం సిఐ రజనీకుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పలువురు పరామర్శ

విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు వేరువేరుగా ఆసుపత్రికి చేరుకున్నారు. ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మతదేహాలను పరిశీలించారు. గాయాల పాలైన వారిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించేలా అక్కడి డాక్టర్లతో మాట్లాడారు.

ఆసుపత్రి వద్ద ఘటనపై ఆరా తీస్తున్న మాజీ ఎంఎల్ఎ బండారు, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ సమావేశం సోమవారం సాదాసీదాగా సాగింది. ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగిన ఎంపిపితో పాటూ జడ్‌పిటిసి సభ్యులు పుట్టపూడి వీరవెంకటసూర్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంలో పనిచేసి అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. సెలవు దినంలో మండల పరిషత్ సమావేశానికి పలువురు అధికారులు, సభ్యులు గైర్హాజరయ్యారు. అనంతరం ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి శాఖల వారీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపిపి సాకా శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటలపోటీలు

ప్రజాశక్తి - మండపేట

స్థానిక మండపేట పబ్లిక్ స్కూల్లో వార్షిక క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండపేట అగ్నిమాపక అధికారి జి.హనుమంతరావు జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం కొత్త విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాసతో విద్యార్థులు ఉండాలన్నారు. ప్రతి సందేహన్ని నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. పాఠశాల అధినేత చిన్నారావు మాట్లాడుతూ రెండు రోజులు పాటు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిరెళ్ల గణేష్, పిఇటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి తోటపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులుపై వేగుళ్ల లీలాకృష్ణ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని పలువురు కాపు నాయకులు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని అరిగెల వీర రాఘవులు కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగన్నాయకులపాలెం సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, నారపరెడ్డి బలరాం, కంచుమర్తి బాబూరావు, కాజులూరు కాపు నేత వంగా రంగా, మాజీ కౌన్సిలర్లు పెంటపాటి శ్రీనివాస్‌రావు, పోతంశెట్టి గోపాల కృష్ణ, సాక్షి వేణు, బి.వెంకటరమణ ఈ సమావేశంలో మాట్లాడారు. రామచంద్రపురం నియోజక వర్గాన్ని భ్రష్టు పట్టించారని, ఎలాంటి అభివృద్ధి చేయలేదని, కాపులను అణిచివేశారని, దాక్షారామంలో కాపు కళ్యాణ మండపం విషయంలో కాపులకు తీరని అన్యాయం చేశారని, అలాగే పల్లిపాలెంలో అమాయకుల

సమావేశంలో మాట్లాడుతున్న కాపుసంఘం నేతలు

భూములను తోట త్రిమూర్తులు దౌర్జన్యంగా లాక్కున్నారని జనసేన మండపేట నియోజక వర్గం కో-ఆర్డినేటర్ వేగుళ్ల లీలాకష్ణ మాట్లాడటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్‌సి తోట రామచంద్రపురానికి ఆర్‌డిఒ కార్యాలయం, ఆర్‌టిఒ కార్యాలయాలను తీసుకొచ్చారన్నారు. పట్టణంలో మెయిన్ రోడ్డు అభివృద్ధి, స్థానిక ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి, ఎస్‌సి గురుకుల పాఠశాల, కృత్తివెంటి పేర్రాజు పంతులు అగ్రికల్చర్ కళాశాల, హార్టికల్చర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల తీసుకొచ్చిందని ఎంఎల్‌సి తోట త్రిమూరులేనని గుర్తు చేశారు. జడ్‌పి వైస్ ఛైర్మన్, నీటి సంఘాల అధ్యక్షులుగా పలువురు కాపులకు పదవులను ఇప్పించారన్నారు. ఎంఎల్‌సి తోటను కులం పేరుతో విమర్శిస్తే ఇకపై కాపులు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. త్రిమూర్తులపై అవాకులు చవాకులు పేలడం ఆపకపోతే నియోజక వర్గంలోని కాపులు వల్లూరులో లీలాకృష్ణ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కవల నానాజీ, గంటా సత్తిబాబు, వెలిది శేషారావు, అరిగెల శ్రీనివాసు, పిట్టా నాని, ఉండి సత్తిబాబు, ఆకుల పెద్ద, పెమ్మిరెడ్డి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు

దోచుకున్న సొమ్మును రికవరీ చేయిస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండపేట

కేశవరం గ్రామంలో కుర్రవాని మెట్ట అక్రమ గ్రావెల్ విషయంలో దోచుకున్న మొత్తాన్ని టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో ఆర్ ఆర్ యాక్ట్ కింద రికవరీ చేయడంతో పాటు సహకరించిన ఐదుగురు కమిటీ సభ్యుల అధికారులపై కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతానని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయవరం మండలంలో జగనన్న కాలనీలను మెరక చేసేందుకు 14,600 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అవసరమని హౌసింగ్ అధికారులు నిర్ధారించగా కలెక్టర్ నుంచి 2 లక్షల 50 వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తవ్వుకునేందుకు అనుమతులు తెచ్చుకున్నారన్నారు. వాస్తవానికి కొండ 5 లక్షలకు పైగా క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌తో నిండి వుందన్నారు. అయితే ఈ మొత్తం కొండను కరిగించేసినా జగనన్న కాలనీలకు మట్టిని మాత్రం తరలించలేదన్నారు. ఈ రెండు లక్షల యాభై వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను ఎక్కడికి తరలించారో కలెక్టర్ నియమించిన ఐదుగురు కమిటీ అధికారులు సమాధానం చెప్పి తీరాలన్నారు. లేని పక్షంలో చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఉంగరాల రాంబాబు, అడ్వకేట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న శ్యామ్‌కుమార్

పలు కుటుంబాలకు శ్యామ్‌కుమార్ పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి, టిడిపి సీనియర్ నాయకులు పరమట శ్యామ్ కుమార్ సోమవారం అమలాపురం మండలం తాండవపల్లి గ్రామంలో పలువురి కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన కొంకి బాస్కరరావు, పితాని సత్యవతి, మట్ట ప్రసాద్, మోకా వెంకటరమణ ఇటీవల అకాల మరణం చెందడం తో వారి కుటుంబ సభ్యులను శ్యామ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పరమట భీమ మహేష్, కుంచె వెంకటేశ్వరరావు, కుంచె అర్జున్, పరమట వెంకటేశ్, సన్నీ, మధుబాబు, బళ్ల సురేష్ తదితరులున్నారు.

పలుచోట్ల బాబు ష్యూరిటీ...

ప్రజాశక్తి - ఆలమూరు, కొత్తపేట, మండపేట

మండలంలోని చెముడులంకలో 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబు, మండల మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి వెంకటరత్నం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరుగుతూ మినీమేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కొత్తపల్లి రాంబాబు, నాగిరెడ్డి శ్రీనువాస్, ఉంగరాల బాబులు, సిరంగుల సతీష్, తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట మూడో వార్డులో బండారు సత్యానందరావు పిలుపుమేరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం టిడిపి నాయకులు నిర్వహించారు. ఇంటింటా పర్యటించి మినీ మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, కముజు గంగాధరం,గుబ్బల మూర్తి, దూనబోయిన ప్రదీప్, టి.సీతారామరాజు, కముజు తాతాజి, మామిడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. గ్రామంలో "బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ప్రజా సమస్యలపై ఆయన ఆరా తీశారు. వీటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అల్పపీడనంతో అలజడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

బంగాళాఖాతంలో అల్పపీడనం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పంటలు పూర్తయి కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో వాతావరణ శాఖ అధికారుల ప్రకటన అన్నదాతల్లో అలజడి సృష్టిస్తోంది. గతవారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ద్రోణి ప్రభావంతో పలు వరిచేలు నేలకొరిగాయి. ఇప్పుడిప్పుడే తిరిగి కోతలకు సిద్ధమవుతున్న సమయంలో మరో అల్పపీడనం ఏర్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు వరిచేలు నేలమట్టమై ఉండగా ప్రస్తుతం ఇస్తున్న ఈదురుగాలులు అల్పపీడనంతో మిగిలిన పంటలు కూడా నేలర్‌రిగే అవకాశం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వరుసగా అల్పపీడనాలు ఏర్పడడంతో తొలకరి పంట చేతికి వస్తుందా రాదా ? అని మదనపడుతున్నారు.

'పితాని' కుటుంబానికి రమణారావు పరామర్శ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం తాండవపల్లికి చెందిన వైసిపి నాయకుడు పితాని సత్యనారాయణ సతీమణి సత్యవతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సతీ వియోగంతో బాధపడుతున్న సత్యనారాయణను సోమవారం వైసిపి సీనియర్ నాయకులు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు కుంచే రాముడు, అర్జున్, కొండబాబు, తరుణ్ గోపాల్, గుత్తాల శ్రీను, నేరేడుమల్లి శ్రీను, గంటా లక్ష్మీప్రసాద్, పరమట రాజేష్, పల్లి వెంకన్న తదితరులు ఉన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న రమణారావు

జగన్‌కు అండగా నిలవాలి...

ప్రజాశక్తి - మండపేట

పేదల అభ్యున్నతి ధ్యేయంగా పాలన సాగిస్తున్న సంక్షేమ సారధి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం వైసిపి గ్రామ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు దేవు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జడ్.మేడపాడులో పర్యటించారు. రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జడ్‌పిటిసి సభ్యులు కుడిపూడి భవాని, ఎంపిపి వుండమట్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి గ్రామంలోని బిసి ఏరియా, వంతెన దిగువ, పంచాయతీ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయన దష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ రాజు, గ్రామ కార్యదర్శి అమరనాథ్ చౌదరిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ద్వారపూడి ఉప సర్పంచ్ తులా శేషారావు, నాయకులు గారపాటి అశోక్ కుమార్, దంతులూరి శ్రీరామవర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమలాపురం మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండల పరిషత్ సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో జరుగుతుందని ఎంపిడిఒ జె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఎంపిపి కుడిపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు, అధికారులు అందరూ పాల్గొనాలని ఎంపిడిఒ కారారు. వివిధ ప్రజా సమస్యలను ఈ సమావేశంలో చర్చించి పరిష్కారాలపై చర్యలు తీసుకుంటారని తెలిపారు.

కార్టూన్ 'నిజం'

రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ డ్రామా

ప్రజాశక్తి - అమలాపురం

కోల్డ్ స్టోరేజ్‌లో వున్న ఎస్‌సి వర్గీకరణ అంశం మళ్లీ తెరపైకి తేవడం రాజకీయ డ్రామాలో భాగమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంఎకె.భీమారావు అన్నారు. సోమవారం అమలాపురం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్‌సి వర్గీకరణను దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు చెత్తబుట్టలో పడవేసిందని గురు చేశారు. దేశ ప్రధాని ఒక కులానికి కొమ్ముగాయడం కులతత్వపు పోకడలను రెచ్చగొట్టడమేనని జిల్లా అధ్యక్షులు పినిపే రాధాకృష్ణ అన్నారు. రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు జగడం సత్యనారాయణ మాట్లాడుతూ మంద కృష్ణ బుద్ధి మందమైందని సత్తా ఉంటే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేయాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా మంద కష్ణ మాదిగలను మభ్యపెట్టడం మానుకుని దళిత రాజ్యాధికారానికి ఐక్యత ఉద్యమంలో నడవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు నామాడి శివాజీ, దళిత యువ నాయకులు మాకే సిద్దు, పట్టణ నాయకులు ఉబ్బన శీను, రేవు ప్రసాద్, మాకే మల్లేశ్వరరావు, అయితాబత్తుల మధు, సిహెచ్ విక్రమ్, తదితరులు పాల్గొన్నారు. పెరిగిన జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్‌సి రిజర్వేషన్ శాతాన్ని 25 శాతానికి పెంచాలని, ప్రైవేట్ రంగంలో జాతీయస్థాయిలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు కల్పించాలని, వ్యవసాయ కూలీలకు రూ.5వేలు పింఛన్ మంజూరు చేయాలి, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న భీమారావు తదితరులు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

నకిలీ అధికారుల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - రాజానగరం

విజిలెన్స్ అధికారులమంటూ జాతీయ రహదారిపై వాహనాలను ఆపి డబ్బు వసూలు చేస్తున్న నకిలీ అధికారుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సిఐ కాశీ విశ్వనాథ్ ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక మీడియా సమావేశంలో సోమవారం వివరించారు. పిఠాపురం చెందిన సంగుల వరప్రసాద్, భూజేంద్రస్వామి ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం సరఫరా చేస్తుంటారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అధికారులమంటూ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఆపి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే కలవచర్ల సెంటర్లలోని జాతీయ రహదారి వద్ద కారులో వచ్చిన వారు విజిలెన్స్ అధికారులమంటూ పిడిఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాలను ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. ఈ సమాచారం రావడంతో హుటాహుటినా సంఘటన ప్రాంతానికి ఎస్ఐ సుధాకర్ వెళ్లి సంబంధిత వ్యక్తుల గుర్తింపు కార్డులను అడిగారు. వారి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో నకిలీ అధికారులుగా గుర్తించి రాజపూడికి చెందిన నాగిరెడ్డి వెంకటరమణమూర్తి, సామర్లకోటకు చెందిన ఇమ్మడి సత్తిబాబులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇదే సమయంలో పెద్దాపురం మండలం రాగంపేటకు చెందిన గొల్లపల్లి చక్రధర్, గొల్లప్రోలు చెందిన జాగు దుర్గారావు, కాండ్రకోట సమీపంలో మర్లలోవ చెందిన సంగన బుజ్జి పరారయ్యారని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీని కారు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలం మల్లేపల్లి గ్రామ శివారు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీని కారు ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు మల్లేపల్లి వచ్చేసరికి లారీ వెనక నుంచి ఢీకొట్టింది. కారులో ఉన్న ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురుకు తీవ్ర గాయాలయ్యాయి. గండేపల్లి ఎస్ఐ యర్రంశెట్టి గణేష్ కుమార్ సమాచారం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను హైవే సిబ్బందితో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఎస్‌సి కాలనీలో రెండు తాటాకిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యింది. సమాచారం తెలుసుకున్న వెంటనే ఫైర్ ఇంజన్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి పూర్తిగా మరి ఒకటి పాక్షికంగా దగ్ధమైనట్లు తెలిపారు. సిద్దబత్తుల వీరభద్రరావుకు సంబంధించిన ఇల్లు దగ్ధమై రూ.80,000, సిద్దాబత్తుల కాంతంకు చెందిన ఇల్లు దగ్ధమై రూ.30,000 నష్టం వాటిల్లినట్లు తెలిపారు. సిద్దాబత్తుల సోమరాజు బైకు దగ్ధమైందని వారు తెలిపారు

మంటలు అర్పుతున్న ఫైర్ సిబ్బంది

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - బిక్కవోలు

బలబద్రపురంలో నంది రామాలయం వద్ద సోమవారం గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం..బలబద్రపురం గ్రామంలో కాలువ కింద వ్యవసాయ భూముల నుంచి గడ్డిలోడుతో తాతానగరం వైపు వెళుతున్న ట్రాక్టర్ నంది రామాలయం వద్ద పైన ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో గడ్డితోపాటు, ట్రాక్టర్ ట్రక్కు స్వల్పంగా దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు 50 వేల రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని అనపర్తి అగ్నిమాపిక అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని, విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు పేర్కొన్నారు.

ఏడిద సీతానగరంలో రోడ్డులో పమాదకరంగా ఉన్న కల్వర్టు

ప్రమాదభరితంగా కల్వర్టులు

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని ఏడిద సీతానగరంలో మారేడుబాక, ఏడిద నుండి ఏడిద సీతానగరం వెళ్ళే ఆర్.అండ్.బి రోడ్డులోని కల్వర్టులు ప్రమాదభరింగా మారాయి. వాటిపై నుంచి రాకపోకలు సాగించాలంటే స్థానికులు, ప్రయాణికులకు బెంబేలెత్తుతున్నారు. ఈ రోడ్డుల్లో నాలుగు కల్వర్టులు ఉండగా వీటికిరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు తలపిస్తున్నాయి. ఈ కల్వర్టులకిరువైపులా ఎటువంటి రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో ఏడిదలోని దేవుడు కాలనీ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద ఒక ప్రయాణికుడు ప్రమాదానికి గురయ్యాడని స్థానికులు తెలిపారు. పెనుప్రమాదం చోటుచేసుకోక ముందే త్వరితగతిన కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

చేతికందొచ్చి.. చేజారిన బిడ్డలు..

ప్రజాశక్తి - తాళ్లరేవు

పెయింటింగ్ పనులు చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా నిలిస్తున్న ఆ యువకులను రోడ్డు ప్రమాదం అర్ధాంతరంగా పొట్టనపెట్టుకుంది. సెల్ ఫోన్ కొనడానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. మరణించిన యువకుల్లో ముగ్గురు తాళ్లరేవుకు చెందినవారు. నలుగురూ ఒకే బైకుపై యానాం నుంచి తాళ్లరేవు బయలుదేరారు. జాతీయ రహదారి 216పై లచ్చిపాలెం చేరుకునే సమయానికి ఏమి జరిగిందో తెలియదు. వారి ముందు వెళ్తున్న ఇటుక లోడు ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. బైకు నడుపుతున్న ఓలేటి శ్రీను నుదురు భాగం రెండు ముక్కలుగా విడిపోయింది. పాలెపు ప్రసాద్‌కు తల వెనుక తీవ్ర గాయం కాగా, వీరిద్దరికీ అధిక రక్తస్రావం అయింది. ఈ ప్రమాదంలో వైదాడి రాజు శరీరంపై గాయాలు పైకి కనిపించడం లేదు. ముగ్గురు యువకులు ఘటనా స్థలంలోనే మరణించారు.

శ్రీను

రాజు



రాజు

వాహనం చివరిలో కూర్చున్న తాళ్ళరేవు రచ్చవారిపేటకు చెందిన రచ్చ శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా, అపస్మారక స్థితికి లోనవడంతో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మరణించిన పాలెపు ప్రసాద్ ఐ.పోలవరం మండలం ఎదురులంక జగనన్న కాలనీకి చెందిన యువకుడు. సెల్ ఫోన్ కొనుక్కుని వస్తానని తన తల్లితో చెప్పి యానాం స్నేహితులతో వచ్చాడు. స్నేహితులతో కలిసి తాళ్లరేవు బైక్‌పై స్నేహితుల ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మరణించిన ఓలేటి శ్రీనుకు భార్య, నాలుగేళ్ల చిన్నారి ఉంది. శ్రీను మరణించిన విషయం వారికి ఇంకా తెలియదు. తండ్రి ఇక లేడు అన్న చేదు నిజం ఆ చిన్నారికి ఎలా చెప్పాలో కుటుంబ సభ్యులకు అర్థం కావడం లేదు.

ఇద్దరి కొడుకులను కోల్పోయిన తల్లి

మరణించిన ముగ్గురు యువకుల్లో ఒక ఐ.పోలవరం మండలం ఎదుర్లంక జగనన్న కాలనీకి చెందిన పాలెపు ప్రసాద్ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. కొడుకు మరణంతో ప్రసాద్ తల్లి విలపిస్తున్న తీరు పలువురి మనసులను కలచివేసింది. మరణించిన ప్రసాద్ తమ్ముడు పాలెపు గణేష్ ప్రేమ వివాహం చేసుకున్న తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడాదిన్నర క్రితమే మరణించాడు. ఇప్పుడు ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఘోర ప్రమాదంలో మరణించాడంతో ఆ తల్లి విలవిలలాడిపోతోంది.

మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లి, బంధువులు

యానాం వార్తలు

క్లబ్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పేకాట క్లబ్ మూసివేయాలని ఆందోళన

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని స్థానిక మెట్టకూరులో లక్ష్మీ గణేష్ ఓల్డ్ రైస్ మిల్ వద్ద రిక్రియేషన్ పేరుతో ఏర్పాటు చేసిన విక్టరీ యానాం క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. విక్టరీ యానాం క్లబ్ తక్షణమే మూసివేయాలని మెట్టకూరు ఫిషర్మెన్ పేట, రామన్నకోడు, వంశీకృష్ణ కాలనీ, రమాబాయి నగర్, గణపతి నగర్ తదితర గ్రామాల ప్రజలు క్లబ్ వద్ద ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి సిఐ షణ్ముగం, ఎస్ఐలు నూకరాజు, కట్టా సుబ్బరాజు చేరుకుని ఆందోళనకారులను అదుపు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఈ పేకాట క్లబ్ వల్ల తమ జీవితాలు సర్వనాశనం అవుతాయని, ఇళ్ల మధ్యలో కాకుండా దూరంగా పెట్టాలని డిమాండ్ చేశారు. పేకాట క్లబ్బు మూసి వేయకపోతే తీవ్రస్థాయిలో ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

ఎంఎల్ఎ సొంత నిధులతో గట్టు నిర్మాణం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ శివారు దరియాలతిప్ప ఎస్‌సి ఫీల్డ్ లేబర్ సొసైటీకి చెందిన పంటపొలాల వెంబడి ఉన్న గోదావరి వరద రక్షణగట్టు ఇటీవలి వచ్చిన వరదలకు కూలిపోయింది. దీంతో రైతాంగం తమ పంటలను కోల్పోవడంతో సమస్యపై స్పందించిన ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన సొంతఖర్చులతో గట్టు పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమవారం దరియాలతిప్ప లోని ఐలాండ్-3 పరిధిలోని భూమలను ఆ చెంతనే శరవేగంగా జరుగుతున్న రక్షణ గట్టు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గతేడాది వచ్చిన వరదలకు రక్షణగట్టు కొట్టుకుపోయి తమ పొలాలు ముంపునకు గురయ్యాయని దీంతో పెట్టుబడులు సైతం నష్టపోయామన్నారు. ఉప్పునీరు పొలాల్లోకి వస్తుందని రక్షణగట్టు నిర్మాణం చేయాలని ఎంఎల్ఎ అశోక్‌కు విన్నవించడంతో ఆయన స్పందించి సొంత ఖర్చులతో పనులు సాగిస్తున్నారన్నారు. శాశ్వతప్రాతిపదికన పనులకు ప్రభుత్వం ద్వారా నిధులు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. తిరుకోటి నాగేశ్వరరావు, కొల్లు మాధవస్వామి, కోరుకొండ ఆనంద్, సబ్బతి శ్రీను, సబ్బతి లోకేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదాన నిధికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీబాలాబాలాజీ స్వామి శ్యాశ్వత నిత్య అన్నదాన ట్రస్ట్‌కు కాకినాడకు చెందిన జంధ్యాల అరవింద్, విజయలక్ష్మి దంపతులు వారి కుమార్తెలు దీప్తి, శ్వేత పేరున ముక్కోటి ఏకాదశిరోజు అన్నదానం జరిపించేందుకు రూ.50 వేల విరాళం ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంది మాధవి తెలిపారు. దాతలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు. దీపావళి సందర్భంగా ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా సాధువులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. పెదపట్నంలంక మహాలక్ష్మీ ఆలయం వద్ద సోమవారం బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగిందని తెలిపారు. స్వామి వారికి ఆలయ ఎసి గ్రంథి మాధవి దంపతులు నూతన దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ప్రధాన అర్చకులు సింగరాచార్యులు, సోమయాజులు, వెంకటాచార్యులు ధర్మకర్తలు చిట్టాల సత్తిబాబు, కె.సూరిబాబు. జి. శ్రీనివాస్, బొరుసు పల్లంరాజు, ఎంపిటిసి కె. జంగమయ్య, కె. రాము పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రజక మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

రజక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 26న గుంటూరులో జరిగే రజక ఆత్మ గౌరవ మహాసభ పోస్టర్‌ను సంఘం ప్రతినిధులు మామిడికుదురులో సోమవారం ఆవిష్కరించారు. రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని, 50 ఏళ్ల నిండినవారికి పింఛను ఇవ్వాలని చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని తదితర డిమాండ్లతో ఈ సభను నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు పాతపాటి అంజిబాబు పిలుపు మేరకు చలో గుంటూరును విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. ఈ ఆవిష్కరణ సభలో కొత్తపల్లి శ్రీనివాసరావు, నగరపు సుబ్రహ్మణ్యం, పేట భాస్కరరావు, కొత్తపల్లి దుర్గారావు, నేదునూరి రాజ్‌కుమార్, అధికారపు వీరన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక స్నానాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దక్షిణ కాశీగా పేర్గాంచిన రాజమహేంద్రవరంలోని పవిత్ర గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎంపి మార్గాని భరత్ రామ్ తెలిపారు. సోమవారం నగరంలోని కోటిలింగాల ఘాట్, పుష్కర్ ఘాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక స్నానాలు చేసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచీ వేల సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తుంటారని చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పిల్లలు, వృద్ధులు నదిలోకి దిగకుండా గట్టుపైనే స్నానాలు చేసేందుకు ప్రత్యేక ఆర్టిఫిషియల్ షవర్స్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కోటిలింగాల ఘాట్ సమీపంలో గల నదిలో బంకమట్టి తొలగించి ఇసుక వేయడం జరిగిందన్నారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఆపదా రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా రోప్స్ కట్టడం, అలాగే రెండు బోట్లను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కార్తీక మాస ఆరంభం మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచే భక్తులు స్నానాలకు వచ్చే అవకాశం ఉండటంతో ఫ్లడ్ లైట్లు, ఆర్టిఫిషియల్ షవర్స్ స్టార్ట్ అవుతాయన్నారు. ఘాట్ల పరిశీలన అనంతరం పుష్కర్ ఘాట్ సమీపంలో గల చిత్రాంగి అతిథి గృహాన్ని ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్ఎంసి ఎస్ఇ పాండురంగారావు, ఇఇలు అలీ, శేషగిరి, ఎఇ పిల్లి ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైసిపి నాయకులు అడపా శ్రీహరి, మజ్జి అప్పారావు, అరిగెల బాబు, దుంగా మంగ, రామ్ సాయి దీపు, వాకచర్ల కృష్ణ, సప్పా ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలల దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో నేడు బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్ వద్దగల గాంధీపురం-2 మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ముఖ్య అతిథులుగా తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి, సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కర్రి రామారెడ్డి, దొరబాబు యువసేన (అనపర్తి) గౌరవాధ్యక్షులు కర్రి ధర్మారెడ్డి (దొరబాబు) పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన వ్యాసరచన కథల పోటీల విజేతలకు జడ్జీ ప్రత్యూష కుమారి బహుమతి ప్రధానం చేస్తారని ఆయన తెలిపారు.

మునికూడలిలో గడప గడపకూ..

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మునికూడలి గ్రామంలో సోమవారం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఎంతో వ్యత్యాసం ఉందని, గతంలో నాయకులు ఓట్ల కోసం మాత్రమే ప్రజల దగ్గరికి వస్తే నేడు అధికారంలో ఉన్న ఎంఎల్ఎలు ప్రతి ఒక్కరి ఇంటికి వచ్చి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గంటా శ్రీను, కరుటూరి హరిబాబు, ఎంపిపి గుర్రాల జ్యోస్నా, గెద్దాడ త్రిమూర్తులు, డాక్టర్ నూతంగి నాగన్నదొర, ఎంపిటిసి ధనలక్ష్మి, అంబటి రాజు, కొల్లి చిరంజీవి, అబ్బన్న దొర తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి సిఎం జగన్ అవసరమా'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నియంతలా పాలన సాగిస్తున్న జగన్ రెడ్డి రాష్ట్రానికి అవసరమా? అని మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వైసిపి ఈ రాష్ట్రానికి జగన్ కావాలి అని ఒక ప్రత్యేకమైన కార్యక్రమం ప్రతి గ్రామంలోనూ నిర్వహిస్తోందని, అది అర్థం లేని కార్యక్రమమని పేర్కొన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన 102 పథకాలను రద్దు చేసినందుకు జగన్ రెడ్డి కావాలా? రాజధాని నిర్మాణంలో నిర్లక్ష్యం చేసినందుకు కావాలా? పేదలకు ఉపయోగ పడే పథకాలను అటకెక్కించి నందుకు కావాలా? అని ఆయన నిలదీశారు. ఈ తరుణంలో వైసిపి నాయకులు ఎపి నీడ్స్ జగన్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో జగన్ రెడ్డి ఒక్కొక్క కుటుంబంపైనా 8.25 లక్షల అదనపు భారం మోపారన్నారు. ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు.

ఇంటింటా జనసేన ప్రచారం

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని మోడేకుర్రులో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. 'జనసేనకు అవకాశం ఇద్దాం ప్రజాప్రభుత్వాన్ని స్థాపిద్దాం' పేర ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రస్తుతం ప్రభుత్వం వల్ల ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేనకు అవకాశం ఇస్తే కచ్చితంగా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొక్కా ఆదినారాయణ, మండల అధ్యక్షులు కంతంశెట్టి సత్య ప్రసాద్(చంటి), మండల ఉపాధ్యక్షులు చింతపల్లి సత్తిపండు, గ్రామ అధ్యక్షులు కోటిపల్లి పండు, నాయకులు చింతపల్లి ఈశ్వరరావు, కేతా ధనరాజ్, చెరుకూరి శ్రీను, మైగపుల భూషణం, పైడికొండల వెంకటేష్, మైగాపుల చిన్న, మైగాపుల సుబ్రహ్మణ్యం, దార్లంక శ్రీనివాస్, కురసా కొండా పాల్గొన్నారు.

కార్పెంటర్స్ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాష్ట్ర కార్పెంటర్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా కమిటీ ఎన్నికలు సోమవారం అమలాపురం మండలం బండారులంక గంగాదేవి మురుగులమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువులు బల్ల మల్లేశ్వర అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి రామకష్ణ, గౌరవ అధ్యక్షులు అప్పారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు విగ్నేష్, కోశాధికారి కడియం శ్రీనివాసరావులను నూతన కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మణిపూర్ క్రైస్తవులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

సాయం అందిస్తున్న ఫెలోషిప్ సభ్యులు

మణిపూర్ మారణ కాండలో మరణించిన క్రైస్తవుల కుటుంబాలకు ఐ. పోలవరం మండల పాస్టర్ ఫెలోషిప్ యూనియన్ ముందుకు వచ్చి రూ.53వేలు విరాళాన్ని అందించారు. మండల పాస్టర్స్ యూనియన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ మణిపూర్ ఘటనలను నియంత్రించడంలో బిజెపి ప్రభుత్వ ఘోరంగా విఫలమైందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్ బాధితుల కోసం తమ ప్రతినిధి సీమోను పేతురు ద్వారా విరాళాలు సేకరించామన్నారు. విరాళాన్ని ఇచ్చిన పాస్టర్లకు, వారి కుటుంబాలకు యూనియన్ ప్రెసిడెంట్ కె.ఎలీషా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఎం.సునీల్ శాస్త్రి, వైస్ ప్రెసిడెంట్ రేవు జాన్సన్, ట్రెజరర్ సామ్యూల్, జాయింట్ ట్రెజరర్ పి. సూర్యప్రకాష్, తదితరులు సహకరించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం, మండపేట

కపిలేశ్వరపురం అంగర శాఖ గ్రంథాలయంలో 14 నుంచి 20వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించ నున్నట్లు గ్రంథాలయాధికారి డి.శివకుమారి తెలిపారు. సోమవారం ఆమె ఈ వివరాలను వెల్లడించారు. వారోత్సవాల్లో భాగంగా సదస్సులు, సమావేశాలు, పుస్తక ప్రదర్శనలు, విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సర్పంచ్ సాకా శ్రీని వాస్, నాయకులు కట్ట మురళీకృష్ణ, కుడి పూడి విజయకుమార్, చింత పెద్దకాపు ఆధ్వర్యంలో వారోత్సవాల పోస్టర్‌నుఆవిష్కరించారు. ఈ నెల 14 నుంచి 20వ వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని మండపేట శాఖా గ్రంథాలయ అధికారి ఎస్.పూర్ణమ్మ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని వతెలిపారు. మంగళవారం, బాలలు దినోత్సవాన్ని పుర్కరించుకుని పర్యావరణ పరిరక్షణ, బుధవారం పుస్తక ప్రదర్శన, గురువారం గ్రంథాలయాలు -ఉపయోగాలు, శుక్రవారం దేశభక్తి గేయాలు, శనివారం క్విజ్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ముగింపురోజు బహుమతులు అందిస్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మరోతి శివ గణేష్

ఇథైల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమం

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఉన్న ఇథైల్ ఆల్కహాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యచరణను రూపొందించనున్నట్లు జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ తెలిపారు. అచ్చుతాపురం గ్రామంలో ఈ పరిశ్రమ వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మళ్ల దొడ్డి గ్రామంలో ఇథైల్ ఆల్కహాల్ పరిశ్రమ నిర్మించడం వల్ల జలవాయు కాలుష్యం కారణంగా సుమారు 200 గ్రామాలకు చెందిన 10 లక్షల మంది అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యచరణను రూపొందించేందుకు ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో త్వరలోనే అఖిలపక్షం సమావేశాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి కాంగ్రెస్, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేలా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. రాబోయే కాలంలో ప్రతి గ్రామంలోనూ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లపూడి శ్రీరామచంద్రమూర్తి, అవసరాల వెంకటాచల సుధాకర్, నక్క సత్యనారాయణ, కర్రి వీర గణేష్, గుర్రాల రత్నాజీరావు, జనసేన పార్టీ నాయకులు ఉంగరాల మణిరత్నం, దోసపాటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్

రాజమహేంద్రవరం : కొవ్వూరు - రాజమహేంద్రవరం పట్టణాలను కలిపే రోడ్డు కం రైలు బ్రిడ్జిపై సోమవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సు లగేజ్‌తో రాజమహేంద్రవరం వస్తుండగా కొవ్వూరు వంతెన ప్రారంభంలో భారీ వాహనాలు రాకుండా అడ్డుగా వేసిన గడ్డర్ బస్సుపైన ఉన్న లగేజీ ఢీ కొట్టింది. దీంతో సుమారు గంటసేపు బస్సు రోడ్డుపైన నిలిచిపోయింది. ఫలితంగా వాహనాలు రాకపోకలు ఆగిపోయాయి. సమాచారం తెలుసు కున్న ఆర్‌టిసి సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు బస్సును అక్కడి నుంచి మళ్లించడతో సాధారణ స్థితి నెలకొంది.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD.
O.S.No. 1688 Of 2021

Between:
Union Bank of India, [A Govt. of India undertaking]
[formerly]Andra Bank
rep.by Manager, Credit Card Division
Head Office, Koti, Sultan Bazar, Hyderabad. **...Plaintiff.**

AND

Mr. G.Sudheer Kumar Reddy alias G.Sudheer Reddy, S/o Mr.G.S.S.N. Reddy, Aged about 29 yrs,Occ: Business, H.no.2-296, Srinagar, Near Padmasri Theatre, Anaparthy, East Godavari District - 533342.
Or
Mr.G.Sudheer Kumar Reddy alias G.Sudheer Reddy, S/o Mr.G.S.S.N. Reddy, Vikram Polymers, D.no. 8-234/2, Anaparthy, East Godavari District - 533342. **...Defendant**

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 1688 of 2021 on the file of Hon'ble V Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 1,50,679.92 to your credit card ending with no. -1006. You are therefore directed to appear in person or through Advocate on 20.11.23 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]
M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,
Chikkadapalli, Hyderabad.
Cell:98496 66587

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD.
O.S.No. 3362 Of 2021

Between:
Union Bank of India, [A Govt. of India undertaking]
[formerly]Andra Bank
rep.by Manager, Credit Card Division, Head Office, Koti, Sultan Bazar, Hyderabad. **...Plaintiff.**

AND

Mr.G.Venkata Ram Reddy, S/o Mr.Satayanarayana Reddy,
Aged about 41yrs, Occ: Business,
Prop:. Satya Sai Rama Poultries,
5-68, Satrasavidi street,
Balabhadrapuram, Biccavolu mandal, East Godavari-533343.
...Defendant

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 3362 of 2021 on the file of Hon'ble II Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 1,21,523.55 to your credit card ending with no. -3006. You are therefore directed to appear in person or through Advocate on 5.12.23 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]
M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
Chikkadapalli,Hyderabad.
Cell:98496 66587